క్లుప్తంగా

హైదరాబాద్ తరలిన బీఎంఎస్ నాయకులు



గద్వాల అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ భారతీయ మజ్దూర్ సంఘ్ మంగళవారం హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం నుంచి బీఎంఎస్ జిల్లా కన్వీనర్ లక్ష్మి పుత్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు హైదరాబాద్‌కు అధికసంఖ్యలో తరలివెళ్లారు. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కోటి సంతకాల సేకరణ



అయిజ: బీసీల రిజర్వేషన్ పెంచాలని బీఎస్పీ నాయకులు మంగళవారం పట్టణంలో కోటి సంతకాల సేవకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ రిజర్వేషన్లను 27 శాతం నుంచి 52 శాతం పెంచాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ కేశవ రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలిక్ బాషా, రవి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరు గ్రామానికి చెందిన పద్మమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా ఎద్మమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యక్రమంలో యోహాన్, కృపాకర్, దేవన్న, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలి



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ రమణరావు ఆధ్వర్యంలో ఉపాధిహమీ నివేదికలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాలలో ఉపాధిహమీ పనుల కింద మంజూరు చేసిన సీసీ రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయరెడ్డి, పీఆర్ఏఈ నరెందర్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



అయిజ: ఆయిల్‌పాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని చిన్న తాండ్రపాడులో ఏఈఓ చందన ప్రియాంకతో కలిసి ఆలయిల్‌పాం సాగుపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సబ్సిడీ ఇస్తుందని, రైతులు వకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. యాసంగిలో సాగుచేసిన పంటల వివరాలు విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్ చక్రవర్ధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అమలుపై స్పష్టత కరువు

- వేతనం కోసం మధ్యాహ్న భోజన వర్కర్ల ఎదురుచూపు
- రూ.3 వేలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ



ఉండవెల్లిలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈఓ(ఫైల్)

ఉండవెల్లి: ఎన్నో సంవత్సరాలు వేతనాలు పెంచాలని మధ్యాహ్న భోజన వర్కర్లు వివిధ రూపాలలో నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేశారు. వీరి పోరాటాల ఫలితంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో మధ్యాహ్న భోజన వర్కర్ల వేతనాలు రూ.1000 నుంచి రూ.3000 వేల వరకు పెంచుతునట్లు ప్రకటించింది. అంతా బాగానే ఉన్నా వేతనాల మంజూరుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయలేదు. ఇన్నాళ్లు పడ్డ కష్టానికి తగిన ఫలితం దక్కిందని భావించిన తరుణంలో ఉత్తర్వాలో స్పష్టత లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం

అన్ని ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాల కింద ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. ప్రాథమిక స్థాయిలో ప్రతి విద్యార్థికి రోజుకు రూ.5.45, ఆరు నుంచి ఎనిమిది విద్యార్థులకు రూ.8.17, తొమ్మిది నుంచి పది తరగతులకు రూ.10.17 చొప్పున చెల్లిస్తున్నారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు గౌరవ వేతనంగా నెలకు రూ.1000 చెల్లిస్తున్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు ఉన్నాయి.

స్పష్టతపై అయోమయం

అలంపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలు 125, ప్రాథమికోన్నత పాఠశాలలు 52, ఉన్నత పాఠశాలలు 49, అన్ని పాఠశాలలో కలిపి దాదాపు 28,330 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వీరికి 591 మంది ఏజెన్సీ నిర్వాహకులు భోజనాలు వడ్డిస్తున్నారు. వర్కర్లకు పెరిగిన వేతనాలకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన ఉత్తర్వుల్లో స్పష్టత లేకపోవడంతో ఆయోమయంలో పడ్డారు. ఎప్పటి నుంచి ఇవ్వాలి అనే విషయాన్ని స్పష్టంగా లేదు. దీంతో కొంత సందిగ్ధత నెలకొంది.

వెంటనే అమలు చేయాలి



కొన్ని సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్నాను. గతంలో వర్కర్లకు రూ.1000 జీతం ఇస్తున్నరు. ప్రస్తుతం జీతం పెంచడంపై సంతోషంగా ఉంది. ఎప్పటి నుంచి ఇస్తారో తెలియదు. పెంచిన జీతం రూ.3000 వేలను వెంటనే అమలు చేయాలి.

– హుస్సేన్‌బీ, మధ్యాహ్న భోజన వర్కర్, ఉండవెల్లి

అమలుపై స్పష్టత లేదు



మధ్యాహ్న భోజనం వర్కర్లకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ఏ నెల నుంచి ఇవ్వాలో స్పష్టత ఇవ్వలేదు. తదుపరి ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు చెల్లిస్తాం.

–మహ్మద్ సిరాజుద్దిన్, డీఈఓ

గుట్టుగా ఇసుక డంపు?



తూర్పుతండాలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక

కేటీదొడ్డి: మండలంలోని తూర్పుతండా, పూజారి తండా గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రెండు రోజులకు గాను 30 ట్రాక్టర్ల ఇసుక ట్రిప్పులకు పంచాయతీ శాఖ అధికారులు అనుమతి ఇచ్చారు. ఇదే అదునుగా భావించి అనుమతి తీసుకున్న కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. సొంత పనులకు బయట డంపు చేస్తున్నారని ఆయా గ్రామస్తులు ఆరోపించారు. అనుమతులు తీసుకున్న ట్రాక్టర్ల యజమానులు రహస్యంగా ఇసుక డంపు చేస్తున్నారని అధికారులకు వివరించారు. గువ్వలదిన్నె తూర్పుతండా వాగు నుంచి జేసీబీ సహాయంతో కొండాపురం, కర్నాటకకు ఇసుకను తరలిస్తున్నట్లు మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇసుకను ఇతర గ్రామాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుకను అక్రమ రవాణ చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మండల తహసీల్దార్ సుందర్‌రాజు వివరణ కోరగా ఎవరికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.

బ్యాంక్ సేవలపై అవగాహన



జిల్లా కేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు



కలుగోట్ల రైతువేదికలో ..

గద్వాల రూరల్: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలలో భాగంగా ప్రజలకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు లీడ్‌బ్యాంక్ మేనేజర్ అయ్యపురెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక పాతబస్టాండులో 2కె రన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆర్థిక పరమైన అంశాలపై విస్తృతమైన అవగాహన కల్పించే భాగంలో వారం రోజుల పాటు లిటరసీ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా బ్యాంకుల్లో జరిగే వివిధ రకాల లావాదేవీలు, స్కీంల వంటి వాటితో పాటు, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన మార్గాలలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేష్‌బాబు, డీఏవో గోవిందునాయక్, వివిధ బ్యాంకు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: ఆర్థిక అక్షరాస్యత కల్గిన ప్రతి ఒక్కరు బ్యాంక్ సేవలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని కలుగోట్ల పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కలుగోట్ల రైతువేదికలో రైతులకు బ్యాంక్ సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ అంజలి దేవి మాట్లాడుతూ గ్రామీణ రైతులకు దీర్ఘకాలిక, క్రాప్ లోన్లు అందజేస్తామన్నారు. సైబర్ నేరాగాళ్లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ గజేందర్ రెడ్డి మాట్లాడుతూ విదేశాలలో చదువుల కోసం రూ.25 లక్షల లోన్లు, దేశంలో ఎక్కడైన ఉద్యోగాలు చేస్తున్న వారికి రూ.10 లక్షల లోన్లు మంజూరు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జ్ సీఈఓ భరత్ కుమార్, ఎఫ్ఎల్‌సీ కోర్డినేటర్ రామ్ చరణ్ యాదవ్, పీఏసీఎస్ కంప్యూటర్ ఆపరేటర్ జనార్దన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాజరెడ్డి, డీసీసీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచు ఆంజనేయులు, పీఏసీఎస్ డైరెక్టర్ సాయిబాబా, శేషన్న, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై ప్రత్యేక శ్రద్ధ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న చిన్నారులు

అలంపూర్ రూరల్: క్యాన్సర్ నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మెడికల్ ఆఫీసర్ ప్రసూన రాణి అన్నారు. మండలంలోని గొందిమల్లలో అంతర్జాతీయ క్యాన్సర్ దినోత్సవం మంగళవారం జరుపుకున్నారు. అదేవిధంగా క్యాతూరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద ప్రసూనరాణి మెగా సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్‌పై అందరికి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం కొనసాగింది. అలంపూర్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ న్యూప్లాట్స్‌లో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో మొత్తం 158 మంది పరీక్షలు చేసుకున్నారు. 5 మందికి ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. 22 మందికి కళ్ల అద్దాలను అందజేశారు. లింగన్‌వాయిలో మొత్తం140 మంది పరీక్షలు చేసుకున్నారు. హెల్త్‌మేళాలో భాగంగా ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ రామస్వామి, మండల ఆరోగ్య విస్తరణాధికారి లక్ష్మీకాంత్, హెచ్ఏ బాలీశ్వరయ్య, వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

గద్వాల రూరల్: కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గద్వాల పట్టణానికి చెందిన పార్టీ కార్యకర్త ద్యాగ మాసమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించింది. ఈ సందర్భంగా మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మృతురాలి కుటుంబ సభ్యులకు పార్టీ తరపున ప్రమాదబీమా చెక్కు రూ.2 లక్షలను అందజేశారు. గట్టు మండలం బస్సాపురం గ్రామానికి చెందిన వెంకటేష్‌నాయుడుకి మెరుగైన వైద్యం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ కింద రూ.12వేల ఎల్‌వోసీని ఎమ్మెల్యే అందజేశారు.

ఎమ్మెల్యేకు ధన్యవాదాలు

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేరేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసేలా కృషి చేసిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి వాల్మీకి బోయలు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు పూలబొకే ఇచ్చి సంతోషం వ్యక్తం చేశారు.

బీజేపీతోనే అభివృద్ధి



మల్దకల్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ గద్వాల అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని తాటికుంటలో మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం బూత్ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, నర్సింహులు, రవిరెడ్డి, అనిల్, మునిస్వామి, గోవిందు, తిమ్మప్ప, వెంకటేశ్వర్ రెడ్డి, నాగరాజు, వెంకటేష్, లవన్న, గోపాల్, దర్మెల్లి, గోపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

అప్పడే పుట్టిన బిడ్డకు ఆధార్ నమోదు



గట్టు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల కేంద్రానికి చెందిన మహిళ పావని పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డకు ఆధార్ నమోదు కోసం మంగళవారం తల్లి వేలిముద్ర తీసుకునట్లు వైద్యాధికారి శశికరణ్ తెలిపారు. ఇక నుంచి ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్న వారికి ఆస్పత్రిలోనే పుట్టిన బిడ్డకు ఆధార్ నమోదు చేస్తున్నట్లు హెల్త్ సూపర్‌వైజర్ మక్బూద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ హుసేన్, హెల్త్ అసిస్టెంట్ వెంకటాద్రి నాయుడు, డాటా ఎంట్రీ ఆపరేటర్ నాగార్జున పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ధరూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ ఎండీ జబ్బార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నజీమున్నీసా బేగం అధ్యక్షత ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

హరహర మహాదేవ



గువ్వలదిన్నె నుంచి శ్రీశైలంకు బయలు దేరిన శివ స్వాములు

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె నుంచి శివ మాలధారులు మంగళవారం పాదయాత్రగా శ్రీశైలానికి బయలు దేరారు. అంతకు ముందు గ్రామంలోని ఆలయంలో శివ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. వారి కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీశైలంలో మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆలయ అర్చకులు వామనాచార్యులు, కిష్టాచార్యులు, మధ్వాచార్యులు తెలిపారు. భక్తులకు 10 సంవత్సరాలుగా అన్నదానం చేస్తునట్లు వివరించారు. సేవ చేసేందుకు మండల కేంద్రం నుంచి శ్రీశైలానికి అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

డీఈ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 82 ఆధ్వర్యంలో మంగళవారం భోజన సమయంలో డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రఫీ, సుధాకర్, మాసుమ్ మాట్లాడుతూ రానున్న ఏప్రిల్ మాసం నుంచి 50శాతం పీఆర్‌సీని అమలు చేయాలని, ప్రతి సబ్‌స్టేషన్‌లో ఫోర్త్ ఆపరేటర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ నుంచి కన్వర్షన్ జేఎల్ఎం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఎస్‌సీడీఓ శ్వేతా ప్రియదర్శిని

అయిజ: వార్షిక పరీక్షలకు పదో తరగతి విద్యార్థులు సన్నద్ధం కావాలని డీఎస్‌సీడీఓ శ్వేతా ప్రియదర్శిని అన్నారు. మంగళవారం ఏఎఎస్‌డబ్ల్యూ సరోజతో కలిసి డీఎస్‌సీడీఓ బీసీ, ఎస్సీ హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు 10 తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదువుకోవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలు సలహాలు, సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలో వార్డన్ కృష్ణ, బీసీ హాస్టల్ వార్డన్ శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో సన్మార్గం



అవగాహన కల్పిస్తున్న చిన్న వీరేష్

మల్దకల్: ఆధ్యాత్మికతతో సన్మార్గంలో నడిచేందుకు అవకాశం ఉంటుందని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి అధ్యక్షుడు చిన్న వీరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని అమరవాయిలో త్రైత సిద్ధాంత, భగవద్గీత గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు రాసిన ఆధ్యాత్మిక, త్రైతసిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. భగవద్గీత దైవ భక్తిని పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో భాస్కర్, నరేష్, మోహన్, దేవేంద్ర, లక్ష్మీ, కళావతి, పార్వతి, చిట్టెమ్మ, దీపిక, విష్ణు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

గద్వాల అర్బన్: విద్యా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో జిల్లా జనరల్ కౌన్సిల్ ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి విద్యా వ్యవస్థ వెళ్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ అధ్యక్షుడు వంశీకుమార్, కార్యదర్శి చాంద్ పాషా, ఉపాధ్యక్షుడు తిరుమలేష్, సహాయ కార్యదర్శి మురళీ, నాయకులు రమేష్, సురేంద్ర గౌడ్, రాజ్ కుమార్, మనోహర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

అమర జవాన్ల సేవలు మరువలేనివి



పెబ్బేరులో నివాళులర్పిస్తున్న నాయకులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో స్థానిక యువకుల ఆధ్వర్యంలో మంగళవారం పుల్వామ దాడిలో అమరులైన జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువకులు 150 మీటర్ల జాతీయ జెండాను పట్టణంలో ప్రధాన రోడ్డుపై ర్యాలీ తీశారు. అనంతరం స్థానిక సుభాష్ చౌరస్తాలో మూడు నిమిషాలు మౌనం పాటించడంతో పాటు జాతీయ గీతం ఆలపించి మృతి చెందిన జవాన్లకు ఆత్మశాంతి కలుగాలని కోరారు.

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): పుల్వామ దాడిలో మృతి చెందిన అమర జవాన్లకు పెద్దమందడి మండలంలోని ముందరితండా పంచాయతీలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మేఘూరెడ్డితో కలిసి గ్రామస్తులు, యువకులు కొవ్వొత్తులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేఘూరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమర జవాన్ల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. దేశం కోసం 40మంది జవాన్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరమరణం పొందారన్నారు.

బాలల హక్కులను కాపాడుదాం

రాజోళి: బాలల హక్కులను కాపాడే బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ గోవిందు రావు అన్నారు. మంగళవారం మండలంలోని మాన్‌దొడ్డిలో జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహించిన బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థలు మాత్రమే బాలల హక్కుల కోసం కృషి చేస్తే సరిపోదని పిల్లల తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపించాలన్నారు. ఆడపిల్లల హక్కుల పట్ల వివక్ష చూపొద్దన్నారు. పెరుగుతున్న నాగరికత, సాంకేతికను అందిపుచ్చుకోవాలని బాలురతో సమానంగా విద్య అందించాలని కోరారు. కార్యక్రమంలో సీడీపీఓ సుజాత, డీసీపీఓ నర్సింహులు, సర్పంచ్ సవారన్న, పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, పరమేష్, హనిమి రెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

మల్దకల్: బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి, బాలల పరిరక్షణ కమిటీ సభ్యుడు ప్రకాష్ అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దొడ్డి, విఠలాపురం గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు, మహిళల అక్రమ రవాణా, మహిళా వేధింపులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. గ్రామంలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచు పురుషోత్తంరెడ్డి, జయమ్మ, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.